సాక్షి
మెదక్
బుధవారం ၊ 4 ၊ సెప్టెంబర్ ၊ 2024



రియల్ దందా

పేదల కలను ఆసరాగా చేసుకున్న రియల్ వ్యాపారులు అన్ని రకాల హంగులతో వెంచర్‌లు ఏర్పాటు చేసి వారిని నిలువునా ముంచేస్తున్నారు.

వివరాలు 8లో ▸



చేతబడి నెపంతో హత్య

చేతబడి నెపంతో కొంత మంది గ్రామస్తులు ముగ్గురిపై దాడి చేయగా.. ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

వివరాలు 8లో ▸



మేకల దొంగల ముఠా అరెస్ట్

రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మేకలను ఎత్తుకెళ్తున్న దొంగల ముఠాను అల్లాదుర్గం పోలీసులు పట్టుకున్నారు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

18న ఏడుపాయల షాపులకు వేలం పాట

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో నూతనంగా నిర్మించిన షాపులకు ఈ నెల 18న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. టెండర్‌లో ఆశించిన సొమ్ము రాకుంటే ఈ నెల 18న ఓపెన్ టెండర్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. మిగతా వివరాలకు ఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వెంకటస్వామి సేవలు భేష్

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



వెంకటస్వామిని సన్మానించిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నర్సాపూర్ రూరల్: ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న వెంకటస్వామి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటస్వామి సమయపాలన, క్రమశిక్షణతో విద్యార్థులకు పాఠాలు బోధించారని అన్నారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. వెంకటస్వామి దంపతులను రఘోత్తంరెడ్డితో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వేర్వేరుగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు లక్ష్మీనారాయణ, సౌమ్యనాయక్ పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలో అధికారులు

మెదక్‌జోన్ : జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకు 490 చెరువులు పొంగిపొర్లుతుండగా జిల్లాలో అతిపెద్దదైనా కోంటూర్ ఇంకా నిండలేదు. ఆ చెరువు కెపాసిటీ 27 ఫీట్లు కాగా ఇప్పటి వరకు 23 ఫీట్లు మాత్రమే నిండినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అలాగే సోమవారం వరకు జిల్లా వ్యాప్తంగా 165 ఎకరాల్లో పంటలు ముంపునకు గురికాగా మరో 3 ఎకరాలు పెరిగి 168 ఎకరాలకు చేరుకుంది. నష్టాన్ని అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. హవేళిఘనపూర్ మండల కేంద్రంలో గల పెద్ద చెరువు కట్ట తెగిపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. చెరువులోని నీరుపోతే తప్ప దాన్ని మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొంది. ఆయా మండలాల్లో దెబ్బతిన్న రోడ్లతో ఇండ్లను పరిశీలిస్తున్నారు. మట్టిగోడలతో నిర్మించిన పురాతన ఇళ్ల నుండి ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు తరలిస్తున్నారు.

సూర్య కుటుంబాన్ని ఆదుకుంటాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

మెదక్‌జోన్: దుబాయ్‌లో బతుకుదెరువు కోసం వెళ్లి చనిపోయిన మండలంలోని తిమ్మక్కపల్లి తండాకు చెందిన రాట్ల సూర్య కుటుంబాన్ని ఆదుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సూర్య కుటుంబాన్ని పరామర్శించారు. దుబాయ్ నుంచి మృతదేహాన్ని తెప్పించేందుకు ఎంపీ రఘునందన్‌రావు కృషి చేస్తున్నారని ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్య కుటుంబానికి అండగా నిల వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండవీణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, పట్టణాధ్యక్షుడు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

6న దిశ కమిటీ సమావేశం

మెదక్ కలెక్టరేట్: ఈనెల 6న దిశ కమిటీ సమావేశం జరుగుతుందని డీఆర్డీఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో జరిగే ఈ సమావేశానికి ఎంపీ రఘునందన్‌రావు హాజరవుతున్నట్లు తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- త్వరలోనే పంట, ఆస్తి నష్టం అంచనా

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు, వరద బాధితులు అధైర్యపడవద్దని, అందరినీ ఆదుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం హవేళిఘణాపూర్ మండలం దూప్‌సింగ్ తండాను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట, ఆస్తినష్టపోయిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే నష్టాలను అంచనా వేసి వారిని ఆదుకుంటామన్నారు. దూప్‌సింగ్ తండా వెళ్లే రోడ్డు కోతకు గురవడంతో రాకపోకలకు ఇబ్బందులు దురవుతున్నాయన్నాయని తెలిపారు. జిల్లాలో ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి లోను కాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉపయోగంలోకి తీసుకురావాలని పంచాయతీరాజ్ ఈఈ నరసింహులును ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్, డీఈ పాండురంగారావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

మెదక్‌జోన్ : జిల్లాలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపాలిటీ, మత్స్యశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలన్నారు. నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం 'మట్టి వినాయకులను నెలకొల్పి పూజించడంతో పర్యావరణానికి మేలు' అనే నినాదంతో ఉన్న వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్ కుమార్ ఆర్డీఓలు పాల్గొన్నారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి

మెదక్ కలెక్టరేట్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్సవ కమిటీలు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని తద్వారా చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మట్టి గణపతే మహాగణపతి అని, ప్రజలకు అవగాహన కల్పించుటకు పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్, పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దూప్‌సింగ్ తండా వద్ద వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్ తదితరులు

ఆన్‌లైన్‌లోనే ఆ సర్టిఫికెట్లు

- మీ సేవ కేంద్రాల్లో మరో 9 సేవలు అందుబాటులోకి..
- త్వరలోనే ప్రారంభం
- జిల్లాలో 65 సెంటర్లు, 200 మంది ఆపరేటర్లు
- ఇప్పటి వరకు 36 డిపార్ట్‌మెంట్ల నుంచి 314 సర్వీస్‌లు



మెదక్‌లోని మీసేవ సెంటర్

మెదక్ కలెక్టరేట్: రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, కుల, ఆదాయ, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు ఇలా ఏ సర్టిఫికెట్ కావాలన్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకం ప్రారంభించినా... మీ సేవ కేంద్రానికి వెళ్లాల్సిందే. సమాజంలో మీ సేవ కేంద్రాలు ప్రజల జీవితాల్లో ఒక భాగంగా మారాయి. ఇదే తరుణంలో మీ సేవల ద్వారా ప్రభుత్వం మరో 9 సర్వీస్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుంది. జిల్లాలో మొత్తం 65 మీ సేవ సెంటర్లు, జిల్లా కేంద్రమైన మెదక్‌లో ఒక ప్రభుత్వ ఈ సేవ సెంటర్ ఉంది. ఇందులో సుమారు 200 మంది ఆపరేటర్లు పని చేస్తున్నారు.

13 ఏళ్లుగా సేవలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సర్వీస్‌లను ప్రజలకు సులభంగా, వేగంగా అందించే లక్ష్యంతో ఉమ్మడి ఏపీలో మీ సేవ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2011లో ఏర్పాటు చేయగా 13 ఏళ్లుగా మీసేవ సెంటర్ల ప్రభుత్వ సర్వీస్‌లను ప్రజలకు అందిస్తున్నాయి. ప్రస్తుతం మీ సేవల ద్వారా 36 డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన 314 సర్వీస్‌లను ప్రజలకు అందిస్తున్నారు. రోడ్డు రవాణాశాఖ, పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, టీ వ్యాలెట్, విద్యుత్‌శాఖ, దేవాదాయశాఖ, వ్యవసాయశాఖ, సీడీఎంఏ, ఇతర సర్వీసులు, మున్సిపల్, నీటి పారుదల శాఖ, విద్యాశాఖ, హార్టీకల్చర్, న్యాయశాఖ, ఎక్సైజ్‌శాఖ, సీవిల్ సప్లయ్, సదరం, బీసీ వెల్ఫేర్, ధరణి, లేబర్, సోషల్ వెల్ఫేర్ వంటి సేవలను అందిస్తున్నారు.

కొత్త సర్వీస్‌లు ఇవే..

ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ ద్వారా మాన్యువల్‌గా అందజేస్తున్న 9 రకాల సర్వీస్‌లను ఇక నుంచి ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అందజేయాలని నిర్ణయించింది. ఇందులో విద్య, ఉద్యోగార్థులకు అవసరమయ్యే సర్వీస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు మీసేవ ద్వారానే ఆన్‌లైన్‌లో ఇస్తున్నారు. ఈ సర్టిఫికెట్లు రెండోసారి తీసుకుంటే తహసీల్దార్ కార్యాలయంలో మాన్యువల్‌గా పొందాల్సి ఉంది. ఇప్పుడు మీసేవ ద్వారా పొందేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పిడి, స్థానిక నిర్ధారణ, క్రిమిలేయర్–నాన్ క్రిమిలేయర్, మార్కెట్ వాల్యూ సర్టిఫైడ్, ఖాస్రా, సెస్లా పహానీ, ఆర్ఓఆర్, ఐబీ రికార్డులు ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రజలు ఇక నుంచి మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్ ద్వారా ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్ని సర్వీస్‌లైనా అందిస్తాం

మీ సేవ కేంద్రాల్లోకి మరో 9 సర్వీస్‌లు రావడం మంచిదే. ఇటీవల తహసీల్దార్ సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. పూర్తి స్థాయిలో గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 36 డిపార్ట్‌మెంట్లకు సంబంధించి 314 సర్వీస్‌లు అందిస్తున్నాం. ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. – చిగుల్లపల్లిరాజు, మీ సేవ నిర్వాహకుడు, మెదక్

ఆదేశాలు రావాల్సి ఉంది

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మీ సేవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించాం. తహసీల్దార్ కార్యాలయం ద్వారా ప్రస్తుతం మాన్యువల్‌గా అందజేస్తున్న 9 రకాల సర్వీస్‌లు మీ సేవ ద్వారా అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. – లక్ష్మణ్‌బాబు, మెదక్ తహసీల్దార్

పరిమితికి మించి వైద్యం చేయొద్దు

డీఎంహెచ్ఓ శ్రీరామ్

మెదక్‌జోన్: పీఎంపీలు, ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయవద్దని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సూచించారు. మంగళవారం ఆయన కొల్చారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉన్నందున ప్రథమ చికిత్స మాత్రమే నిర్వహించి దగ్గరలోని పీహెచ్‌సీలకు రిఫర్ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డెంగీ, మలేరియా అంటూ భయపెట్టి వైద్యం చేయరాదని కోరారు. అలాగే లింగనిర్ధారణ చేయవద్దని, అలాంటివి ఎవరైనా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండువాగులో జారిపడిన వ్యక్తి



నీటిలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

తాడు సహాయంతో కాపాడిన పోలీసులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలో ఓ వ్యక్తి ఉధృతంగా పారుతున్న గుండువాగులోకి ప్రమాదవశాత్తు మంగళవారం జారి పడిపోయాడు. పోలీసులు రెస్క్యూచేసి తాడు సహాయంతో కాపాడారు. మండలంలోని నల్లకుంటతండాకు చెందిన నంద్యానాయక్, విఠల్ నాయక్ చేపలు పట్టేందుకు గుండువాగు వద్దకు వెళ్లారు. వాగు పొంగిపొర్లుతుండడంతో నంధ్యానాయక్ నీటిలో కొట్టుకుపోయి ఓ బండను పట్టుకొని ఆగాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే జిల్లా క్యూ ఆర్‌టీ సభ్యులు మహేశ్, శ్రీనివాస్, సురేశ్‌నాయక్, కానిస్టేబుల్స్ కృష్ణ, సురేశ్, మహేశ్ కలిసి నంద్యానాయక్‌ను కాపాడారు. వారిని ఎస్పీ, అల్లాదుర్గం సీఐ రేణుక, ఏఎస్ఐ దయానంద్ అభినందించినట్లు తెలిపారు.



నంద్యనాయక్‌తో పోలీసులు

ఎస్పీ అభినందన..

మెదక్ మున్సిపాలిటీ: తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన క్యూఆర్టీ పోలీసులను ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అభినందించారు.

సీనియర్ల దాడిపై డీఎస్పీ విచారణ



గురుకుల పాఠశాలలో విచారణ చేపడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి, అధికారులు

తూప్రాన్: పట్టణ పరిధిలోని బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల దాడుల నేపథ్యంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విచారణ చేపట్టారు. గురుకుల పాఠశాలలో సీనియర్ విద్యార్థులు 9వ తరగతి విద్యార్థులపై దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే.. ఈ సందర్భంగా డీఎస్పీ పాఠశాలలో దాడులకు గల కారణాలను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. ఘర్షణలకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సీనియర్ల దాడిలో గాయపడిన ముగ్గురు విద్యార్థులను తమ తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. దాడులకు పాల్పడిన సీనియర్ విద్యార్థులను వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు డిసెంబర్ 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు విద్యార్థులు చదివే పాఠశాల, కళాశాల ప్రధానోపాధ్యాయుడి, ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు.. స్తంభాలు

ట్రాన్స్‌కోకు రూ.6లక్షల నష్టం: డీఈ కృష్ణారావు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో నాలుగురోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో డీఈ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతో జిల్లాలో ఆయా మండలాల్లో 7 ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడగా, 101 విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. ఇందులో చిన్నలైన్ 69 విద్యుత్ స్తంభాలు, 11కేవీ, 33కేవీ లైన్‌స్తంభాలు 32 దెబ్బతిన్నాయని, మొత్తం రూ.6లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వీటికి మరమ్మతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. హవేళిఘణాపూర్ జక్కన్నపేట(1), ఇదే మండలం కొత్తపల్లి ఫీడర్ పరిధిలో(2), మెదక్ మండలం జానకంపల్లి(1), టేక్మాల్ మండలం కమ్మరికత్త ఫీడర్ పరిధిలో(2), రేగోడ్ ఫీడర్ పరిధి గొట్టిముక్ల (1) ట్రాన్స్‌పార్మర్లు కిందపడి దెబ్బతిన్నట్లు తెలిపారు. వీటితోపాటు ఆయా మండలాల్లో మొత్తం 101 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రణాళిక లోపంతోనే ఇబ్బందులు

- మొద్దునిద్రలో ప్రజాప్రతినిధులు, అధికారులు
- మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి విమర్శ



చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న పద్మారెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతోనే వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ పెద్దచెరువు అలుగు వద్ద పడిన బుంగను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఎప్పుడు ప్రతిపక్షాలను తిడుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన వెంటనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మొద్దునిద్రలో ఉండడం వల్ల ఎడతెరిపి లేని వానల కారణంగా పంట, ప్రాణ నష్టం జరిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, సతీష్‌రావు, కిష్టయ్య, మేకల సాయిలు, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

ఉత్తమ రైతుగా రామకృష్ణాగౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ రైతుగా కౌడిపల్లి మండలం కంచన్‌పల్లికి చెందిన రైతు రామకృష్ణాగౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీజే రావ్ అవార్డు, నగదు పురస్కారం అందచేశారు. సంగారెడ్డి జిల్లా ఏరువాక డాట్ సెంటర్ కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ, సరిత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామకృష్ణాగౌడ్ కొన్నేళ్లుగా ఏరువాక కేంద్రం సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. తక్కువ ఖర్చుతో కొత్తరకం విత్తనాల వరి సాగు చేయడంతోపాటు మల్చింగ్ విధానం, దుక్కిలో వరినాటు వేయడం, పంటలో ట్రాప్ లైట్స్ ఏర్పాటు చేసి అదనపు ఆదాయం కోసం కోళ్ల పెంపకం, పొలంగట్లపై టేకుచెట్ల పెంపకం, కందిసాగు, కూరగాయలసాగు తదితర పంటలు సాగు చేసి జిల్లాస్థాయిలో పేరుతెచ్చుకున్నారని కితాబిచ్చారు.



కౌడిపల్లి: అవార్డు తీసుకుంటున్న రామకృష్ణాగౌడ్

వర్షం పంటలకు ఎంతో మేలు

- యాసంగి సాగుకు సైతం అవకాశం
- వర్షాలపై డీఏఓ గోవింద్



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న చేస్తున్న డీఏఓ గోవింద్

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లా రైతులకు వర్షం ఎంతో మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం, శ్రీభాగ్యలక్ష్మి ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో 3.15లక్షల ఎకరాలలో పంటలు సాగు అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 2.75లక్షల ఎకరాలలో వరి, 35వేల ఎకరాలో పత్తి, 1,200 ఎకరాలలో కంది, 1500 ఎకరాలలో మొక్కజొన్న, 1200 ఎకరాలలో పెసర, మినుము, 500 ఎకరాలలో కూరగాయల సాగు అవుతుందని ఆయన వివరించారు. వరి రైతులు మూడోవిడత ఎకరాకు 25కిలోల పొటాష్, 25కిలోల యూరియా మాత్రమే చల్లుకోవాలని సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 170 ఎకరాలలో పంట నష్టం జరిగిందన్నారు. పంటలలో చీడ పురుగులు ఆశించే అవకాశం ఉందని, నివారణ కోసం రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. పత్తి, ఇతర పంటలలో నీరు చేరితే తొలగించాలని చెప్పారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జాతీయ స్థాయి టెన్నీ కాయిట్‌ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికై నట్లుట్లు సిద్దిపేట జిల్లా టెన్నీకాయిట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కాటం శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజ్‌ కుమార్‌లు తెలిపారు. టెన్నీకాయిట్‌ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో 1 నుంచి 3 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాణించి జాతీయ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఇందులో సబ్‌ జూనియర్‌ అండర్‌–14 బాలుర విభాగంలో సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చందు, దినేష్‌, బాలికల విభాగంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌ బెజ్జంకి విద్యార్థి తన్విక ఉన్నారు. విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్‌, విజయ, వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సింగారెడ్డి శౌరిని అభినందించారు.

ఫుట్‌బాల్‌ పోటీలకి శరత్‌చంద్ర..



శరత్‌ చంద్ర

రామాయంపేట(మెదక్‌): రామాయంపేటలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్న ఫుట్‌బాల్‌ క్రీడాకారుడు శరత్‌చంద్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. పట్టణానికి చెందిన యువజ్యోతి ఫుట్‌బాల్‌ అకాడమీలో శిక్షణ పొందిన శరత్‌ గతేడాది ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. దీంతో శరత్‌ను జాతీయస్థాయి సబ్‌ జూనియర్‌ పోటీలకు ఎంపిక చేసింది. బుధవారం నుంచి అస్సాంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. విద్యార్థి ఎంపికపై యువజ్యోతి అకాడమీ కోచ్‌ బొంతల సత్యనారాయణ, జిల్లా ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి రూపేందర్‌, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'పిన్నింటి'కి గద్దర్‌ అవార్డు



అవార్డు అందుకుంటున్న రత్నం

కొమురవెల్లి(సిద్దిపేట):మండలంలోని అయినాపూర్‌ గ్రామానికి చెందిన కళాకారుడు, కవి, గాయకుడు పిన్నింటి రత్నం ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ అవార్డును జనగామ జిల్లా డీఈవో రాము చేతుల మీదుగా అందుకున్నారు. మంగళవారం భాష సంస్కృత శాఖ ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణంలో గద్దర్‌ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకు రావడం సంతోషకంగా ఉందన్నారు.

బాలిక ఆత్మహత్య

తూప్రాన్‌: బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ పరిధిలోని ఆబోతుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. నక్కలపల్లి మహేందర్‌కు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు శృతి(15) పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. తండ్రి మధ్యాహ్న భోజనం చేసి మంచిగా చదువుకోమని చెప్పి పశువుల కాడికి వెళ్లాడు. కొంత సమయం తర్వాత కుమారుడు ఫోన్‌ చేసి అక్క గదిలోకి వెళ్లి తలుపులు తీయడంలేదని చెప్పాడు. హుటాహుటిన వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూసేసరికి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. కూతురి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదోడి సొంతింటి కలపై రియల్‌ దందా

అమ్మకంపై ఉన్న శ్రద్ధ వసతులపై కరువు

- వెల్దుర్తిలోని వెంచర్లలో అధ్వానంగా డ్రైనేజీ, పార్కులు
- అక్రమార్కులతో పంచాయతీ అధికారుల కుమ్మక్కు
- నిబంధనలకు విరుద్ధంగా తాకట్టు స్థలం రిలీజ్‌

లబోదిబోమంటున్న ప్లాట్ల కొనుగోలుదారులు

కూలీ చేసుకుంటూ పూట గడుపుతున్న నిరుపేదకైనా..గౌరవప్రదమైన జీతం తీసుకునే ఉద్యోగికైనా.. సొంతిళ్లు అనేది ఓ కల. ఉన్నోడు.. లేనోడు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ సొంతింటి కల నిజం చేసుకోవడానికి రాత్రింబవళ్లు కష్టపడుతుంటారు. పైసా.. పైసా కూడబెట్టి తనకున్న స్థలంలో లేక వేరే చోటో ఒక ప్లాటు కొనుగోలు చేసుకొని ఇల్లు కట్టుకుంటాడు. ఇదే అదునుగా పేదల కలను ఆసరాగా చేసుకున్న రియల్‌ వ్యాపారులు వారిని నిలువునా ముంచేస్తున్నారు. అన్ని రకాల హంగులతో వెంచర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటనలు ఇస్తూ జనాన్ని బురిడీకొట్టిస్తూ ప్లాట్లు అమ్ముకున్నాక పత్తాలేకుండా పోతున్నారు.

వెల్దుర్తి(తూప్రాన్‌): వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో డీటీసీపీ అనుమతులతో ఎనిమిది, ఆరెగూడెం పంచాయతీ పరిధిలో ఒకటి వెంచర్‌లు ఏర్పాటు చేశారు. సుమారు 20 ఎకరాల్లో వేర్వేరుగా లే అవుట్‌లు ఏర్పాటు చేసినా ఇందులో ఏ ఒక్క వెంచర్‌లోనూ మౌలిక వసతుల కల్పన లేదు. వెంచర్‌ ఏర్పాటు చేశామా.. ప్లాట్లు విక్రయించామా..డబ్బులు సంపాదించుకున్నామా అన్నట్లు సంబంధిత నిర్వాహకులు వ్యవహరించి కొనుగోలుదారులను ఆకర్షించడానికి తూతూమంత్రంగా డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, విద్యుత్‌ స్థంభాలు ఏర్పాటు చేశారు. తొమ్మిది వెంచర్‌లలో పావలా వంతు భాగం మౌలిక వసతులు ఏర్పాటు చేయకున్నా పంచాయతీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా 15 శాతం తనఖా స్థలాన్ని దర్జాగా రిలీజ్‌ చేసేశారు.

కనిపించని కనీస వసతులు

గ్రామ పంచాయతీ పరిధిలో లే అవుట్‌ ఏర్పాటు చేయాలంటే డీటీసీపీ, మున్సిపల్‌, నగరాల్లోనైతే హెచ్‌ఎండీఏ అనుమతి తప్పనిసరి. పంచాయతీల్లో ఏర్పాటు చేసే వెంచర్‌లలో రోడ్లు, పార్కు, డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించి లే అవుట్‌ స్థలంలో 10 శాతం గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్‌ చేయాలి. అదే విధంగా పార్కులో గ్రీనరీ, క్రీడా, వ్యాయామ పరికరాల ఏర్పాటుతోపాటు అంతర్గత రోడ్లు, రోడ్లకు ఇరువైపులా వీధి దీపాలు, తాగునీటి వాటర్‌ ట్యాంక్‌, ఆలయం, వెంచర్‌ స్థలాన్ని బట్టి డ్రైనేజీ నిర్మాణం వంటి కనీస వసతులను వెంచర్‌ నిర్వాహకులే ఏర్పాటు చేయాలి. ప్లాట్లు కొన్న వారికి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మౌలిక వసతులు పూర్తి చేసే వరకు లే అవుట్‌లో మరో 15 శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీపేరిట అదనంగా రిజిస్ట్రేషన్‌ చేయాల్సి ఉంటుంది. వెంచర్‌లో వసతులు కల్పించాక ఆ స్థలాన్ని గ్రామ పంచాయతీ అధికారి తిరిగి రిలీజ్‌ చేయాల్సి ఉంటుంది. కానీ మండల కేంద్రమైన వెల్దుర్తిలో పుట్టగొడుగుల్లా వెలసిన లే అవుట్‌లలో ఈ నిబంధనలు మచ్చుకైనా కనబడని పరిస్థితి.



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న పార్కు

ఇల్లు కట్టుకోలేని పరిస్థితి

డీటీసీపీ అనుమతులతో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి వారు సొంతిళ్లు కట్టుకోవడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు లేవు. ఓ వెంచర్‌లోనైతే డ్రైనేజీ పైపు లైన్‌ స్థలాన్ని ప్రైవేట్‌ వ్యక్తి ఆక్రమించి దర్జాగా ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసుకున్నాడు.



మురికికూపంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ

ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు



"వెంచర్‌లో ప్లాట్‌ కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుంటున్న వారు ప్రస్తుతం మౌలిక వసతుల కల్పనపై ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొంది. వెంచర్‌ నిర్వాహకులు ప్లాట్లు విక్రయించుకొని పత్తాలేకుండా పోవడం, ఇంటి నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఇస్తున్న పంచాయతీ అధికారులు సమస్యలపై తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అరకొర వసతులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న వెంచర్‌ నిర్వాహకులతో పాటు వారికి సహకరించిన పంచాయతీ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

–బాలరాజు, ప్లాట్‌ కొనుగోలుదారుడు

నిబంధనలకు విరుద్ధంగా స్థలం రిలీజ్‌..

లే అవుట్‌ అనుమతులతో వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఎనిమిది వెంచర్‌లలో 20 శాతం మౌలిక వసతులు పూర్తి చేయకున్నా పంచాయతీ కార్యదర్శి ఆరు వెంచర్‌లకు సంబంధించిన 15 శాతం తాకట్టు స్థలాన్ని రిలీజ్‌ చేశాడు. పార్కులో గ్రీనరీ ఏర్పాటు చేయకపోవడంతో నేడు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయి. డ్రైనేజీకి అవుట్‌పుట్‌ లేక మురుగునీరంతా ఖాళీ ప్లాట్లలోనే నిలిచిఉంటుంది. మౌలిక వసతులు పూర్తయ్యేవరకు పంచాయతీ ఆధీనంలో ఉండాల్సిన తాకట్టు స్థలాన్ని వెంచర్‌ నిర్వాహకులతో చేతులు కలిపి పంచాయతీ కార్యదర్శి దర్జాగా రిలీజ్‌ చేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చేతబడి నెపంతో హత్య

- మరో ఇద్దరికి గాయాలు
- టేక్మాల్‌ మండలంలో ఘటన

టేక్మాల్‌(మెదక్‌): చేతబడి నెపంతో కొంత మంది గ్రామస్తులు ముగ్గురిపై దాడి చేయగా.. ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన టేక్మాల్‌ మండలం గొల్లగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్చారం మండలం ఏటిగడ్డ మందాపూర్‌కు చెందిన దేవునికాడి రాములు (52), మెదక్‌కు ఇల్లరికం వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నాడు. రాములు ఒగ్గు కళాకారుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీన తన కోడలు గొల్లగూడెంకు చెందిన బురుజుకింది గంగవ్వ ఇంటివద్దకు స్నేహితురాలు సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లికి చెందిన కుర్మ బాలమణినితో కలిసి వచ్చాడు. గ్రామంలో తిరుగుతూ అక్కడక్కడ నిమ్మకాయలతో పాటు, పసుపు–కుంకుమ వేశారని కొంతమంది స్థానికులు ఆరోపించారు. ప్రతీ అమావాస్య, పౌర్ణమికి వీరు గొల్లగూడెం వస్తున్నారని మండిపడ్డారు. గంగవ్వ ఇంటి సమీపంలో, మరొకరి పశువుల కొట్టం వద్ద నిమ్మకాయలు పెట్టడం, సోమవారం అమావాస్య కావడంతో వారిని స్థానికులు నిలదీశారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహించిన స్థానికులు.. గంగవ్వ ఇంట్లో ఉన్న రాములు, బాలమణిని బయటకు లాక్కొచ్చి ముగ్గురిని చితకబాదారు. ఊర్లో నుంచి వెళ్లిపోవాలంటూ కొట్టుకుంటూ తీసుకెళ్లారు. దీంతో స్పృహకోల్పోయిన రాములు అక్కడికక్కడే మృతిచెందగా.. గంగవ్వ, బాలమణి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ దయానంద్‌ తన సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. రాములు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, గాయపడిన వారిని అదే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మృతుడి కుమారుడు శివకుమార్‌ ఫిర్యాదు మేరకు నిందితులు బురుజుకింది విఠల్‌, భాస్కర్‌, ఇంద్రవ్వ, సాదు నారాయణపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ దయానంద్‌ తెలిపారు.



చెట్టువద్ద రాములు మృతదేహంతో బాలమణి



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ

మెదక్‌ డీఎస్పీ సందర్శన

కాగా, విషయం తెలుసుకున్న మెదక్‌ డీఎస్పీ ప్రసన్నకుమార్‌, అల్లాదుర్గం సీఐ రేణుక మంగళవారం గొల్లగూడెంను సందర్శించారు. ఈ ఘటనపై ఆరా తీశారు. మంత్రాల నెపంతో దాడులు చేయడం సరికాదన్నారు. ప్రజలు ఇలాంటివి నమ్మకూడదని, ఏమైనా అనుమానం, సందేహాలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలే తప్ప, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని ఆయన సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ రూరల్‌/ నిజాంసాగర్‌: ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగితీగలను దొంగిలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజాంసాగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద ఎస్సై సుధాకర్‌ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మెదక్‌ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌కు చెందిన ఉబిడి లింగమయ్య అలియాస్‌ నాని, చిత్తారి రమేశ్‌, తురపాటి ఏసు, దాసరి రాజు, తురపాటి అంబయ్యలను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వీరి నుంచి 59 ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన రూ. 6 లక్షల విలువ చేసే ఆరు క్వింటాళ్ల కాపర్‌ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై మెదక్‌, కామారెడ్డి జిల్లాల్లోని 8 పోలీస్‌స్టేషన్లలో 35 కేసులు ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకున్న బాన్సువాడ రూరల్‌ సీఐ సత్యనారాయణ గౌడ్‌, నిజాంసాగర్‌ ఎస్సై సుధాకర్‌ను కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ అభినందించినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.



పెసర పంటలో క్షేత్ర ప్రదర్శన చేస్తున్న అధికారులు

నూతన సాగు వైపు మొగ్గు చూపాలి

- జిల్లా వ్యవసాయాధికారి రాధిక
- తోర్నాలలో విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

సిద్దిపేటరూరల్‌: జిల్లా వ్యాప్తంగా రైతులు పంట వైవిధ్యీకరణ వైపు మొగ్గు చూపేలా చూడాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రొ.జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటల్లో ఉత్తమ సాగు పద్ధతులపై రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, అధికారులతో చర్చాగోష్టి నిర్వహించారు. మొదటగా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్‌ శ్రీదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్రను గురించి వివరించారు. నాటి నుంచి నేటి వరకు విశ్వవిద్యాలయం నుంచి రూపొందించిన వంగడాలు, సాంకేతిక అంశాలను తెలియజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక మాట్లాడుతూ.. పంటల వైవిధ్యీకరణ వైపు రైతులు మొగ్గు చూపేలా చైతన్యం చేయడంతోపాటుగా వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం పెసర ఎంజీజీ–385 రకం సాగును రైతులు, విద్యార్థుల సమక్షంలో క్షేత్ర ప్రదర్శన చేశారు. అనంతరం పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి, లింగార్షక బుట్టలు, వేపనూనెలను అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.శ్రీజయ, డా.పల్లవి, డా.ఉమారాణి, డా.శ్వేత, సతీష్‌, రాజా, పలు గ్రామాల రైతులు, వ్యవసాయ పాలిటెక్నిక్‌ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వేప నూనె, లింగార్షక బుట్టలను అందిస్తున్న అధికారులు

రేషన్‌ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు

పౌర సరఫరాల శాఖ ఓఎస్‌డీ ద్రోణాచార్య

గజ్వేల్‌రూరల్‌: పౌర సరఫరాల దుకాణాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఓఎస్‌డీ ద్రోణాచార్య హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని రేషన్‌ (షాపు నంబర్‌ 8, 9, 33, 36) దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సివిల్‌ సప్లయ్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 6 బృందాలు తనిఖీలు చేపడుతున్నాయన్నారు. రేషన్‌ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని సక్రమంగా ప్రజలకు పంపిణీ చేస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. రేషన్‌ దుకాణాల్లోని బియ్యాన్ని శాంపిల్స్‌ సేకరించి ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. రేషన్‌ బియ్యాన్ని రీసైక్లింగ్‌ చేస్తే చర్యలు తప్పవని, ప్రజలు రేషన్‌ బియ్యాన్ని విక్రయించొద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ ప్రభాకర్‌, టెక్నికల్‌ అసిస్టెంట్‌ విజయ భూషణ్‌, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావుల తోపాటు గజ్వేల్‌ ఆర్‌ఐ కృష్ణ పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్‌: బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు



చేర్యాల(సిద్దిపేట): పట్టుకున్న బియ్యంతో పోలీసులు

ఎనిమిది క్వింటాళ్ల బియ్యం పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 8 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌, చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం స్థానిక పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆటోలో రేషన్‌ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం అందింది. పట్టణ శివారులో వాహనాన్ని తనిఖీ చేసి 8 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మాలోత్‌ జితేందర్‌తోపాటు ఆటోను స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు.

మేకల దొంగల ముఠా అరెస్ట్‌

- ఆరుగురు రిమాండ్‌, రూ.4.71 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ రేణుకారెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్‌): రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పోలీస్‌ స్టేషన్‌ల పరిధిలో మేకలను ఎత్తుకెళ్తున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి కథనం మేరకు.. మంగళవారం తెల్లవారు జామున జాతీయ రహదారి కోళ్లపల్లి పాత టోల్‌గేట్‌ వద్ద వాహనాల తనిఖీ చేపట్టాం. ఈ క్రమంలో ఓ వాహనంలో అనుమానాస్పదంగా కనిపించిన ఆరుగురిని అదుపులోకి తీసుకొని విచారించాం. విచారణలో భాగంగా 11 మంది ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నట్లు తేలింది. వివిధ జిల్లాల్లో 16 దొంగతనాలు చేసి, వందకు పైగా మేకలను దొంగిలించామని, వాటిని అమ్ముకుంటూ సొంతంగా వాహనాలు కొనుగోలు చేస్తున్నట్టు ఒప్పుకున్నారు. ఇందులో ఖదీర్‌పాషా, ఎరుకల గోపాల్‌, సాహిద్‌, మహేందర్‌, ఎరుకల అనిల్‌, మెల్ల అనిల్‌కుమార్‌ను అరెస్ట్‌ చేసి, రూ.4.71 లక్షలు, 9 మేకలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగితా ఐదుగురు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని పట్టుకుంటామని తెలిపారు. దొంగలముఠాను పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ ఉదయ్‌కుమార్‌ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పేట ఎస్‌ఐ.శంకర్‌, అల్లాదుర్గం ఎస్‌ఐ.ప్రవీణ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రేణుకారెడ్డి, ఎస్‌ఐలు

చందాపూర్‌.. రాకపోకలు బంద్‌

- వరద తాకిడికి కొట్టుకుపోయిన పల్లె రోడ్డు
- గతంలోనే హై లెవెల్‌ బ్రిడ్జి మంజూరు
- నిధులున్నా ముందుకు సాగని పనులు
- గండిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

చందా'పూర్‌'.. ఇరవై దాకా గృహాలతో ఒక చిన్నపల్లె. భారీ వర్షాలొస్తున్నాయంటే ఆ ఊరి జనం హడలిపోతారు. రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోతాయని భయపడతారు. సుదీర్ఘకాలం నుంచి ఈ పరిస్థితి ఎదుర్కొంటున్న ఆ పల్లె జనం హై లెవెల్‌ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ బాధలు తీర్చేదెవరా అని ఎదురుచూస్తున్నారు. రూ.85 లక్షల నిధులు మంజూరైనా పనులు అగ్రిమెంట్‌కే పరిమితమయ్యాయి.

వర్గల్‌(గజ్వేల్‌): తూప్రాన్‌–గజ్వేల్‌ రహదారిపై ఉన్న బొర్రగూడెం స్టేజీ నుంచి చందాపూర్‌ గ్రామం 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 20 వరకు ఇళ్లు ఉన్నా యి. చందాపూర్‌ రోడ్డు మార్గంలో ఉన్న చెక్‌డ్యాం అలుగు, వరద నీరు వెళ్లేందుకు చిన్నచిన్న పైపులతో కల్వర్టు నిర్మించారు. ఐదారేళ్లుగా వరద ఉధృతి పెరిగిన ప్రతీసారి రోడ్డు కొట్టుకుపోతుంది. తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. మళ్లీ వర్షాలు పడితే షరా మామూలే. తాజాగా మంగళవారం వరద తాకిడికి మళ్లీ రోడ్డు కల్వర్టు కొట్టుకుపోయింది. చందాపూర్‌ వాసులు ఊరు దాటే మార్గానికి మూతపడింది.

'హై లెవెల్‌ బ్రిడ్జి' అగ్రిమెంట్‌కే పరిమితం

బొర్రగూడెం–చందాపూర్‌ మార్గంలో చెక్‌డ్యాం వరద తాకిడికి రోడ్డు కొట్టుకుపోతుండటంతో శాశ్వత పరిష్కారం దిశగా 'హై లెవెల్‌ బ్రిడ్జి' నిర్మాణానికి రూ. 85 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనుల కోసం పంచాయతీరాజ్‌ ఇంజినీరింగ్‌ శాఖ టెండర్‌ నిర్వహించింది. టెండర్‌ దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో సెప్టెంబర్‌ 27, 2023న అధికారులు అగ్రిమెంట్‌ చేయించుకొని పనులు అప్పగించారు. దీని ప్రకారం మార్చి 26, 2024 వరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని నిర్దేశించారు. గడువు దాటి ఐదు నెలలైనా అక్కడ పనులు మాత్రం కార్యరూపం దాల్చలేదు. పంచాయతీరాజ్‌ ఇంజినీరింగ్‌ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫైనల్‌ నోటీస్‌ కూడా జారీ చేశారు.


రోడ్డును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే..

వరద తాకిడికి కొట్టుకుపోయిన రోడ్డును మంగళవారం గజ్వేల్‌ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పరిశీలించారు. అక్కడి గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. అక్కడి నుంచే పంచాయతీరాజ్‌ డీప్యూటీ ఈఈ ప్రభాకర్‌తో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టాలని, రాకపోకలు పునరుద్ధరించాలని సూచించారు.



గండి పడిన తీరును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, తదితరులు

ఉధృతంగా మోయతుమ్మెద వాగు



కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): మండలంలోని బస్వాపూర్‌ వద్ద ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో హనుమకొండ–సిద్దిపేట ప్రధాన రహదారిపై మరోసారి మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మూడో రోజు వాహనాల రాకపోకలు నిలిపివేశారు.బస్వాపూర్‌ నుంచి పోతిరెడ్డిపల్లి మీదుగా హుస్నాబాద్‌ వైపు వాహనాల దారి మళ్లించారు. కాగా లో లెవల్‌ వంతెన కూల్చి వేసి హై లెవల్‌ వంతెన నిర్మిస్తున్నారు.నిర్మాణం పూర్తి అయితే సమస్య తీరునుంది.

మా బాధలు పట్టించుకోండి



వరద వచ్చినపుడల్లా మా రోడ్డు కొట్టుకుపోతుంది. ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. వరద తగ్గి తాత్కాలిక మరమ్మతులు చేసే వరకు ఎక్కడికి వెళ్లలేకపోతున్నాం. రోగాలు, నొప్పులతో బాధపడే వారున్నా, గర్భిణులు ఉన్నా, ముందు జాగ్రత్తగా వరదలకు ముందే ఊరు దాటించాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి ఈ సమస్య మమ్ములను వేధిస్తుంది. ప్రభుత్వం దృష్టి సారించి పై వంతెన నిర్మించాలి.

– చందాపూర్‌ గ్రామ మహిళలు

తాత్కాలిక మరమ్మతులు చేపడతాం

చందాపూర్‌ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి అగ్రిమెంట్‌ గడువు ముగిసింది. మార్చిలోనే పనులు పూర్తి కావాలి. కాంట్రాక్టర్‌కు ఫైనల్‌ నోటీసు కూడా జారీ అయింది. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రాకపోకలు పునరుద్ధరించేందుకు తాత్కాలిక మరమ్మతులు చేపడతాం.

– ప్రభాకర్‌, డిప్యూటీ ఈఈ, పంచాయతీరాజ్‌ విభాగం

జాలరి మృతదేహం లభ్యం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి కల్వర్టులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన సందిరి లక్ష్మణ్‌(45) మృతదేహం మంగళవారం కాల్వలో లభ్యమైంది. సిద్దిపేట సీఐ శ్రీను, బెజ్జంకి ఎస్‌ఐ క్రిష్టారెడ్డిలు ఫైర్‌ సిబ్బంది, గజ ఈతగాళ్లతో మూడు రోజులుగా వెతుకుతుండగా కల్వర్టు నుంచి వచ్చే కాల్వలో లక్ష్మణ్‌ మృతదేహాన్ని గుర్తించారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు శ్రవణ్‌ ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్‌ ఉపాధి పనులకు వెళ్తుండగా ఇంటి వద్ద తన భార్య పచారి దుకాణం నిర్వహిస్తుంది. వర్షం కురుస్తున్నప్పటికీ జాలరి లక్ష్మణ్‌ను వెతికేందుకు కృషి చేసిన ఏసీపీ మధు, రూరల్‌ సీఐ శ్రీను, ఆర్‌డీఓ రామ్మూర్తి, తహసీల్దార్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ క్రిష్టారెడ్డి, ఫైర్‌, స్థానిక మత్స్యకారుల సొసైటీ సభ్యులకు మాజీ సర్పంచ్‌ నర్సింప రావు కృతజ్ఞతలు తెలిపారు.



లక్ష్మణ్‌ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు